Namasthe Telangana 01-24/01/18

# ‘మెట్రో’ రెండోదశ డీపీఆర్‌ను సిద్ధం చేయండి

- మొదటి దశ పనులు సకాలంలో పూర్తికావాలి
- మెట్రోరైలుపై సమీక్షలో సీఎస్ ఎస్పీసింగ్



సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ ఎస్పీసింగ్. చిత్రంలో మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెట్రోరైలు విస్తరణలో భాగంగా రెండోదశ డీపీఆర్ సిద్ధం చేయాలని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ ఆదేశించారు. ప్రాజెక్టు సమగ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, అనుమతుల కోసం కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. సీఎస్ ఎస్పీసింగ్ మంగళవారం మెట్రోరైలుపై సమీక్ష జరిపారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లతోపాటు హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, సీనియర్ అధికారుల సమన్వయంతో డీపీఆర్ తయారు చేయాలన్నారు. మొదటిదశ పనులు 2018 చివరినాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ చివరినాటికి కారిడార్-1లోని అమీర్‌పేట-ఎల్బీనగర్ (16 కి.మీ), కారిడార్-3లోని అమీర్‌పేట-హైటెక్‌సిటీ(10 కి.మీ) పెండింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. ఈ ఏడాది చివరినాటికి కారిడార్-2లోని జేబీఎస్-ఎంజీబీఎస్(9 కి.మీ) మార్గాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో భాగంగా ఫీడర్ సర్వీసులను పెంచాలన్నారు. నాగోల్-మియాపూర్ మధ్య 30 కిలోమీటర్ల ఆపరేషన్స్‌లో ఫీడర్ సర్వీసులుగా అందుబాటులోకి తేనున్న విద్యుత్‌తో నడిచే వాహనాలతోపాటు ఆర్టీసీ ఫీడర్ సర్వీసులపై ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, హైదరాబాద్ కలెక్టర్ యోగితారాణా, మేడ్చల్ కలెక్టర్ ఎంవీరెడ్డి, ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తంనాయక్, ఎల్‌అండ్‌టీ మెట్రోరైలు సీఈఓ అండ్ ఎండీ కేవీబీరెడ్డి పాల్గొన్నారు.